ఇళ్లు లేకుండా వారు పడుతున్న ఇబ్బందులను మహాధర్నా వేదికపై వివరిస్తున్న గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ మహిళలు

మహాధర్నాలో పాల్గొన్న జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేదలు

కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్

ప్రభుత్వంపై.. తిరుగుబాటు తప్పదు..!

- ◆ కబ్జాదారుల కోసమే అధికారులు పని చేస్తారా.?
- ◆ అరగంట గడువిస్తే కబ్జా భూములన్నింటినీ పేదలకు పంచేస్తాం
- ◆ ఇళ్ల పట్టాలు ఇవ్వకుంటే ప్రభుత్వ పతనం తప్పదు
- ◆ మహాధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్
- ◆ ముగిసిన పేదల పాదయాత్ర ◆ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'పేదలను విస్మరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోంది... అధికారులు భూకబ్జాదారులు, ధనవంతుల కోసమే అన్నట్టు పని చేస్తున్నారు.. ఈ పద్ధతిలో మార్పు రాకపోతే అధికారులు, ప్రజాప్రతినిధులపై తిరుగుబాటు తప్పదు' అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హెచ్చరించారు. జిల్లాలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించాలని, సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పేదలపాదయాత్ర శుక్రవారం ముగిసింది. గుత్తి నుంచి ప్రారంభమైన పాదయాత్ర పలు మండలాల మీదుగా అనంతపురం నగరానికి చేరుకుంది. శుక్రవారం ఉదయం సోములదొడ్డి నుంచి సిపిఎం నాయకులు పేదలతో కలిసి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. మహిళలు చంటి బిడ్డలను ఎత్తుకుని పాదయాత్రలో నడిచారు. ఇళ్లు లేకుండా వారు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. అనంతరం కలక్టరేట్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ధర్నాకు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మద్దతు తెలిపారు. వీరితో పాటు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.క్రిష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, ముస్కిన్‌తో పాటు జిల్లా నలమూలల నుంచి నుంచి వచ్చిన వందలాది మంది పేదలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇళునిర్మించి, తాళాలు చేతిలో పెడతామంటూ నమ్మబలికిన ముఖ్యమంత్రి మాటలు నాలుగేళ్లు కావస్తున్నా ఆచరణకు నోచుకోలేదన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాటలు అధికరంలోకి వచ్చాక ఆచరణకు నోచుకోలేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి జన్మదినం రోజున అనంతపురం జిల్లాలో వేలాది ఇళ్ల ప్రారంభిస్తామని గొప్పలు చెప్పి ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రారంభించలేదన్నారు. జగనన్న కాలనీల పేరుతో అధికార పార్టీ నేతలు, కాంట్రాక్టర్ల జేబులు నింపారు తప్పా, ఒక్క పేదవాడికి కూడా ఇల్లు నిర్మించిన దాఖలాలు లేవన్నారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి లేఅవుట్‌లు వేసి విక్రయించి కోట్ల రూపాయలు దండుకునే దగుల్‌బాజీలకు అధికారులు తొత్తులుగా వ్యవహరించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలేస్తే అర్ధరాత్రికే పోలీసులు గద్దల్లా వాలి గుడిసెలు పీకేసి, కాల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 11 మంది తహశీల్దార్‌లు అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ భూములను అప్పనంగా కబ్జాదారులకు దోచిపెడుతున్నారని చెప్పారు. గుత్తి, గుంతకల్, పామిడి, కల్లూరు, కూడేరు, పుట్లూరు, విడపనకల్లు, మోపిడి, ముష్టూరు, కూడేరు, అనంతపురం రూరల్ మండల పరిధిలోని పేదలు ఇళ్ల పట్టాల కోసం సంవత్సరాల తరబడి ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా స్పందించే వారు లేరన్నారు. తమకు అరగంట సమయం ఇస్తే జిల్లా వ్యాప్తంగా కబ్జా భూములన్నింటినీ స్వాధీనం చేసుకుని పేదలకు పంచేస్తామని చెప్పారు. 2023 జనవరిలోగా ఇళ్ల పట్టాలు, సాగు భూములకు పట్టాలు ఇవ్వని పక్షంలో ప్రజలందరినీ కలుపుకుని తామే ఆ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెడతామని తెలియజేశారు.

పేదల కోసం పని చేసే ప్రభుత్వాలు లేవు : పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రంలో పేదల కోసం పని చేసే ప్రభుత్వాలు నేడు లేవని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తెలిపారు. రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాలు రెండూ పెట్టుబడిదారులు, దోపిడీదారులకు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. సెంటూ భూమి ఇవ్వడానికి ప్రభుత్వాలకు చేతులు రాకపోవడం విచారకరం అన్నారు. ప్రజల కోసం పని చేస్తున్న ఎర్రజెండా వామపక్షాల పోరాటాలకు మద్దతుగా ప్రజలు నిలిచి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను తిప్పి కొట్టాలన్నారు. సిపిఎం జిల్లా నాయకులు ఎం.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ నవరత్నాలు ఏమయ్యాయో జగన్ సమాధానం చెప్పాలన్నారు. కూడు, గూడు ఇవ్వకుండా ఎన్ని రత్నాలు తెస్తే ఎవరికి లాభం అంటూ ప్రశ్నించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన పాదయాత్రలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం స్ఫూర్తినిచ్చిందన్నారు. చంటి పిల్లలను చక్కనెత్తుకుని మండుటెండలో మహిళలు నడిచిన తీరు కన్నీళ్లను తెప్పించాయని తెలిపారు. వారి కోసం పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి ఇళ్ల పట్టాలు ఇప్పించేలా కషి చేస్తామనానరు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వడంలో అధికారులు అలసత్వం వహించడం అన్యాయంగా ఉందన్నారు. ప్రభుత్వాలు, నాయకులు మారుతున్న పేదల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. సిపిఎం జిల్లా నాయకులు తరిమెల నాగరాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మించి ఇవ్వాలన్నారు. సాగుదారులకు పట్టా ఇవ్వాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ అనంతపురం నగరం, రూరల్ కాలనీల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో రాబోవు రోజుల్లో పోరాటాలు చేయాల్సి వస్తుందని, జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ సమస్యలపై ఇదివరకే ఆయా మండలాల తహశీల్దార్‌లకు అర్జీలు అందజేశామని, మరో మారు అర్జీలను కలెక్టర్‌కు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, డి.శ్రీనివాసులు, రామాంజినేయులు, వెంకటనారాయణ, గోపాల్, ముర్తుజా, వలి, మసూద్, బాబు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్రయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతపత్రం అందజేత

మహాధర్నా అనంతరం కలెక్టర్‌ను కలవాలని సిపిఎం నాయకులు, ప్రజలు కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు వారిని అడ్డుకున్నారు. సూపరింటెండెంట్ తిరుమల రెడ్డికి పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన నిరసనకారుల వద్దకే వచ్చి అర్జీలను స్వీకరించారు. కల్లురు, పామిడి, గుంతకల్లు నుంచి వచ్చిన మహిళలు ఇళ్లు లేక వారు పడుతున్న కష్టాలను అధికారి ఎదుట వాపోయారు. సమస్య పరిష్కారానికి కషి చేస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు.

పేదల ఇళ్లు, సాగుభూమి సమస్యలపై కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న రాంభూపాల్ తదితరులు

జిల్లాలో నేరాలు, పోలీసులు తీసుకున్న చర్యలపై వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ డా॥ఫక్కీరప్ప

తగ్గిన నేరాలు..!

మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు

వార్షిక నేర గణాంకాలను వెల్లడించిన ఎస్పీ డాక్టర్ కె.ఫక్కీరప్ప

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2022వ సంవత్సరంలో నేరాల సంఖ్య తగ్గాయి... అయితే జరిగిన నేరాల్లో మహిళలపై జరిగిన అఘాయిత్యాల శాతం పెరిగింది. వార్షిక నేర గణాంకాల వివరాలను జిల్లా ఎస్పీ కె.ఫక్కీరప్ప గురువారం నాడు మీడియాకు వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన మీడియా సమావేశంలో అనంతపురం నేరలకు సంబంధించి వార్షిక గణాంకాలను వెల్లడించారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.

నేరాలు తగ్గుముఖం

2021వ సంవత్సరంతో పోలిస్తే 2022 నేరాల సంఖ్య కాస్త తక్కువగానే జరిగాయి. ఐపిసి, ఎస్ఎల్ఎల్, సిఆర్‌పిసి కింద మొత్తం 13,438 కేసులు 2021లో నమోదయ్యాయి. ఈ ఏడాదిలో అవి మొత్తం 8,352 నమోదయ్యాయి. భౌతికదాడులకు సంబంధించిన హత్యలు, హత్యాయత్నాలు, దాడులకు సంబంధించి గతేడాది జిల్లా మొత్తంగా 1194 ఘటనలు జరిగాయి. ఈ ఏడాది 1034 చోటు చేసుకున్నాయి. ఇందులో అంతకు మునుపు ఏడాది 59 హత్యలు జరగ్గా ఈ ఏడాది 50 చోటు చేసుకున్నాయి.

దొంగతనాల్లో స్వల్ప తగ్గుదల

దొంగతనాలు, దోపిడీల్లో ఈ ఏడాది గతేడాది కంటే తక్కవనే చెప్పాలి. 2021లో 582 ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది అవి 580గా నమోదయ్యాయి. దొంగతనం చేసే సమయంలో జరిగిన హత్యలు ఒక్కటీ జరగలేదు. సాధారణ దొంగతనాలు మాత్రం నాలుగు శాతం పెరిగాయి. 2021లో 384 దొంగతనాలు జరగ్గా ఈ ఏడాది 398 జరిగాయి. దోపిడీలో గతేడాది ఒకటి అయితే ఈసారి ఏడు ఘటనలు చోటు చేసుకున్నాయి.

మొత్తం కేసుల్లో మహిళలపై అఘాయిత్యాలే అధికం

జరిగిన ఘటనలతో పోలిస్తే ఇందులో మహిళలపై అఘాయిత్యాలు గతేడాది కంటే పెరిగాయని చెప్పవచ్చు. అంతకమునుపు ఏడాది 2021లో రెండు వరకట్నపు హత్యలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది అవి ఆరు జరిగాయి. గతేడాది కంటే 200 శాతం అధికంగా జరిగాయి. కిడ్నాపుల్లో చూసినప్పుడు 2021వ సంవత్సరంలో మొత్తం జరిగిన కిడ్నాప్‌లు 40 అయితే అందులో 32 మంది మహిళలు ఉన్నారు. అంటే 80 శాతం కేసుల్లో మహిళలు బాధితులుగానున్నారు. ఇక ఈ ఏడాది 2022వ సంవత్సరంలో 31 కిడ్నాప్‌లు జరిగినట్టు కేసులు నమోదయితే 28 కేసుల్లో మహిళలు బాధితులుగా ఉన్నారు. అంటే 90 శాతం కేసుల్లో మహిళలు బాధితులుగానున్నారు. వరకట్న వేదింపుల కేసులు గతం కంటే ఏడాది 11 శాతం పెరిగాయి. 2021వ సంవత్సరంలో 219 కేసులు వరకట్న వేదింపులు కేసులు నమోదవగా ఈ ఏడాది అవి 248 కేసులు నమోదయ్యాయి. గతేడాది మహిళల హత్యలు 18 జరగ్గా ఈ ఏడాది అవి 11 జరిగాయి. మహిళలపై హింస మాత్రం పెరిగిందని చెప్పవచ్చు. పోక్సో చట్టం కింద నమోదయిన కేసులు గతేడాది 121 ఉంటే ఈసారి 89 ఉన్నాయి.

తగ్గిన రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా ఈ ఏడాది తగ్గాయి. అంతకు మునుపు ఏడాది 592 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ సంవత్సరంలో 533 ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇందులో మరణించిన వారి సంఖ్య కూడా గతేడాది 351 అయితే, 321 ఈ సంవత్సరం జరిగాయి. గాయపడ్డ వారి సంఖ్య గతేడాది 658 జరిగాయి. ఈసారి ఇప్పటి వరకు 576 జరిగాయి.

కొన్ని ప్రశంసనీయ అంశాలు

ఈ ఏడాది కొన్ని ప్రశంసనీయ కార్యక్రమాలను పోలీసు శాఖ చేపట్టింది. గతంలో ఎన్నడూలేని విధంగా వరదలు ఈ ఏడాది అనంతపురం నగరంలో చోటు చేసుకున్నాయి. ఈసమయంలో ప్రజలను సురక్షితంగా రక్షించి బయటకు తీసుకురావడంలో కీలకంగా పనిచేశారు. డబ్బు కోసం బాలుడిని కిడ్నాప్ చేస్తే నాలుగు గంటల్లో బాలుడిని రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఏడాది ఆఖరులో లక్రమంగా మరణాయుధాలు విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను పట్టుకుని అరెస్టు చేయడం. మొబైల్ ఫోన్ పొగొట్టుకున్న వారికి తిరిగి అప్పగించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం లాంటికార్యక్రామలు అనేకం పోలీసు శాఖ ద్వారా చేపడుతున్నట్టు ఎస్పి పీక్కరప్ప తెలిపారు. అదే సమయంలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టినట్టు వివరించారు. సిబ్బంది పిల్లలు ఉన్నత చదువులు చదివే వారికి స్కాలర్‌షిప్‌ను అందజేయడం, సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులు, బి.శ్రీనవాసులు, మహబూబ్ బాషా, నరసింగప్ప, చైతన్య తదితరలు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో ఏర్పాటు చేసిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, బాబు జగ్జీవన్‌రామ్, తెలుగు తల్లి, మదర్ తెరిసా, మహత్మ జ్యోతిరావు పూలే, మాజీ పార్లమెంటు సభ్యులు అనంత వెంకట్ రెడ్డిలతో పాటు ఇతర విగ్రహాలను ఏర్పాటు చేశారని, వాటిని పరిరక్షించి పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేష్, ఓ.నల్లప్ప గురువారం డిమాండ్ చేశారు. విగ్రహాలను పరిశుభ్రత, పరిరక్షణ కోసం అనంతపురం నగర కార్పొరేషన్ సిబ్బందిని నియమించాలన్నారు. ప్రభుత్వ అధికారులు కేవలం మహనీయుల జయంతులు, వర్ధంతి సందర్భంగా శుభ్రత చేసి, హంగు ఆర్భాటాలు చేయడం తప్ప ప్రతి రోజూ శుభ్రం చేసే దిక్కులేదన్నారు. ఇప్పటికైనా దయవుంచి మహనీయుల విగ్రహాలను దుమ్ము, ధూళి నుండి రక్షించి ప్రతిరోజు విగ్రహాలను శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నగర అధ్యక్షులు అక్కులప్ప, కార్యదర్శి జీవరత్నం, రూరల్ కమిటీ అధ్యక్షులు రాజాజి తదితరులు పాల్గొన్నారు.

'దర్భశయనం'కు చం.స్పందన జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మట్టిని తన చెమటతో, నెత్తురుతో హరితమయం చేస్తున్న రైతుల పక్షం వహించి పది కవితా సంపుటాలను వెలువరించి రైతు కవిగా ప్రసిద్ధులైన దర్భశయనం శ్రీనివాసాచార్యకు 2021వ సంవత్సరానికి 'స్పందన' అనంత కవుల వేదిక 'చం. స్పందన' జీవన సాఫల్య పురస్కారంను ప్రకటించింది. ఎప్పటికప్పుడు స్వీయ విమర్శకు గురి చేసుకుని మళ్లీ తనను తాను అక్షరాల హరిత కాంతిలో నిలబెట్టుకుంటున్న నిబద్ధకవి దర్భశయనం. ప్రపంచీకరణలో సమాజం పోగొట్టుకుంటున్న మనిషితనాన్ని, పత్ర హరితాన్ని, పరాగాన్ని తిరిగి పొందడానికి చేసే పోరాటం ఈయన కవిత్వం అంతా పరుచుకొని ఉంటుంది. తన కవిత్వంలో రూప పరంగా సరళత, ప్రయోగ శీలత భావపరంగా గాఢత సాధించిన ప్రముఖ కవి దర్భశయనంకు త్వరలో స్థానిక ప్రభుత్వ కళాశాలలో జరగనున్న సభలో చం.స్పందన 2021 జీవన సాఫల్య పురస్కారంను ప్రదానం చేస్తారని 'స్పందన' అనంత కవుల వేదిక అధ్యక్షులు టి.రాజారామ్, ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర శాస్త్రి తెలియజేశారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ఎల్‌పిజి సురక్ష పైపులను ఉపయోగించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గ్యాస్ వినియోగదారులు ఐఎస్ఐ ముద్ర కలిగిన ఎల్‌పిజి సురక్ష రబ్బరు పైపులను ఉపయోగించాలని రాయదుర్గం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (శ్రీదేవి ఎంటర్‌ప్రైజెస్) సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని టి.వీరాపురం పోస్ట్ ఆఫీస్ ఏరియాలో ఏజెన్సీ మేనేజర్ కృష్ణ ఆధ్వర్యంలో మహిళలకు సేఫ్టీ క్లినిక్‌పై గురువారం అవగాహన కల్పించారు. మెకానిక్ ప్రసాద్ సేఫ్టీ క్లినిక్‌కు సంబంధించి పలు విషయాలపై అవగాహన కల్పించారు. సిలిండర్ కన్నా ఎత్తులో గ్యాస్ స్టవ్ ఉంచి వాడాలన్నారు. స్టవ్ సిలిండర్‌కు అనుసంధానంగా వినియోగించే నాణ్యత కలిగిన ఎల్‌పిజి పైపును ఏజెన్సీలో కొనుగోలు చేయాలన్నారు. బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు విక్రయించే పైపులను కొనుగోలు చేయడం వల్ల లీకేజీ సమస్యలు వస్తాయన్నారు. సిలిండర్ లీక్ అయితే వెంటనే గ్యాస్ సిబ్బందికి తెలియజేయాలన్నారు. సొంతంగా మరమ్మతు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సిలిండర్ లీక్ అయినట్లయితే సేఫ్టీ క్యాప్ అమర్చి ఆరుబయట ఉంచాలన్నారు. లీకైన సిలిండర్‌ను ఎలా జాగ్రత్తపరచాలో ప్రయోగాత్మకంగా చూపించారు. గ్యాస్ స్టవ్ ఉపయోగించేటప్పుడు గాలి ప్రసరించేలా కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. గ్యాస్ వాడకం పూర్తయ్యాక రెగ్యులేటర్ ఆఫ్‌చేసి ఉంచాలన్నారు. గ్యాస్‌ను పొదుపుగా ఉపయోగించేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది అల్లాదాదా, డెలివరీ బాయ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై నేటి నుంచి నిరసనలు : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అర్హులైన లబ్ధిదారుల పింఛన్ల తొలగింపుపై సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి అన్ని సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పేదలకు ఆర్థిక భరోసాగా ఉన్న పింఛన్లను నిబంధనల పేరుతో తొలగించడం దుర్మార్గం అన్నారు. ప్రస్తుతం పింఛన్లు పోతే ఆందోళన చెందకండి, జూన్‌లో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చు అనే మోసపూరిత ప్రకటనలు చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ డబ్బులతోనే జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి వారి పింఛన్లు ఒక నెల రాకపోయిన జీవనం గడవడం కష్టం అవుతుందన్నారు. ఏ ఒక్కరి పింఛను కూడా తొలగించకుండా అన్నింటినీ యథావిధింగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పింఛన్లు తొలగించరాదని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ఎదుట నిరసనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ఛైర్మన్ కృషి ఆదర్శం

అనంతపురం కలెక్టరేట్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఆదర్శంగా ఉందని జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నాయకులు అధికారులు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం గ్రంథాలయ ఛైర్మన్ ఉమామోహన్‌రెడ్డికి, ఆమె భర్త మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి దంపతులకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న ఛైర్మన్‌కు అభినందనలు తెలిపారు. వైసిపి నాయకులు రాజగోపాల్‌రెడ్డి, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రవికుమార్, కమ్మన్న, శివశంకర్ ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో స్పోర్ట్స్ డే వేడుకలు

అనంతపురం కలెరేట్ : స్థానిక కమ్మభవన్ సమీపంలోని శ్రీ చైతన్య సి అండ్ ఎం డే స్కాలర్ క్యాంపస్‌లో స్పోర్ట్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎజిఎం సుబ్బారెడ్డి, నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ జాకీర్ హుస్సేన్, ఎస్ఐ చంద్రశేఖర్ హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి పతాకావిష్కరణ చేశారు. ఒలంపిక్ టార్చ్‌ను వెలిగించి విద్యార్థుల చేతుల మీదుగా స్పోర్ట్స్ డే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. సిఐ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల ద్వారా దేహదారుడాన్ని పెంపొందించుకోవాలన్నారు. తద్వారా వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. ఇది చదువులో మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి దోహదం చేస్తుందన్నారు. ఆరోగ్యంతో పాటు మంచి చదువుతో ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విశ్వనాథ్, అకడమిక్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ నాయుడు, డీన్ లు శ్రీనివాసరెడ్డి, సిరాజుద్దీన్, పిఇటి రవిరాజా, సింధు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తూ స్పోర్ట్స్ డే వేడుకలను ప్రారంభిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్లు

'సాయి విజ్ఞాన్' విద్యార్థుల సత్తా

అనంతపురం : స్థానిక మూడవ రోడ్డులోని సాయి విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రో కబడ్డీ పోటీలలో సత్తా చాటారు. ఈనెల 23వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రో కబడ్డీ లీగ్ పోటీలలో పాఠశాల చెందిన సాయికుమార్, కుల్లాయిస్వామి, యశ్వంత్, రాజేష్, పరశురాం, దామోదర్, కౌశిక్, భరత్, చాంద్ చక్కటి ప్రతిభను కనబరిచి మూడవ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కరుణాకర్‌బాబు, ఎంపీ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు లావణ్య రామ్, పిఇటి వన్నూరుస్వామి అభినందించారు. చదువుతోపాటు క్రీడా పోటీలలో తమ విద్యార్థులు సత్తా చాటడం పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తపరిచారు.

రూ.10 వే ఆర్థికసాయం

ఉరవకొండ : అనారోగ్యంతో మృతిచెందిన విడపనకల్ మండలం గడేకల్ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త రాముడు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వై.శివరామిరెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. రాముడు మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఖోఖో క్రీడా సంఘం జిల్లా ప్రెసిడెంట్ భీమ్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విడపనకల్ మాజీ ఎంపీపీ రమణారెడ్డి, గడేకల్ మాజీ సర్పంచి మేకల పంపాపతి డబ్బును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ ఉప సర్పంచి లింగన్న, నాయకులు మేకల కేశవ, డోనేకల్ రాంబాబు, మేకల వెంకటేష్, రవి నివాళి అర్పించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

నార్పల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం వారు మండల పరిధిలోని కొత్తూరు ప్రాథమిక వైద్యశాలను సందర్శించారు.

IN THE COURT OF THE II
ADDL.JUNIOR CIVIL JUDGE:ANANTAPUR
E.P.No.130/2015 in O.S No.317/2010.
Between:
K.Manjunath ... PETITIONER
AND
S.Juleka Begam ... RESPONDENT
NOTICE TO RESPONDENT
To
Shaik Juleka Begam W/o Late S.Mahaboob Peera, D.No.6/1/808/1, Kovoor Nagar, Ananthapuramu.
పై దావాలో అర్జీ దారుడు నీ ఆస్తిని కోర్టులో వేలము వేయుటకు అర్జీ దాఖలు చేసి యున్నాడు. ఇందులకు నీకు ఏమైన ఆక్షేపనలున్న యెడల పై కోర్టు వారి ఎదుట తేది 06-02-2023 న ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని లేక వకీలు ద్వారా గానీ తెలుపుకొనవచ్చును. లేనంతట నీ పరోక్షమందు తీర్మానించెబడును.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
T.RANGA REDDY,
ADVOCATE FOR PETITIONER

In the court of the Hon'ble District Judge,
Ananthapuramu
O.S. No:97/2016
Between:
R.Rami reddy And another ...plaintiffs
And
B.Naga Prasad And Others ...Defendants
Notice to Defendant No:6,7 & 8
D6: V.Nageswaramma W/o V.Rami Reddy
D7: V.Lalitha D/o V.Rami Reddy
D8: V.Ramulu ReddyS/o V.Rami Reddy
All are R/at Tirumala Nagar, Tapovanam, Ananthapuramu .
పై నెంబరు దావాలో ప్రతివాదులయిన మీ హాజరు నిమిత్తం 06-01-2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.Shyam Sunder K.Mohana Rao
ADVOCATES, ANANTHAPURAMU

In the court of the IIIrd Addl.
Junior CivilJudge, Ananthapuramu
O.S.NO:663/2019
Between:
Sake Peddakka ...Plaintiff
And
Doddipalli Nagamuni and others ...Defendants
NOTICE TO DEFENDENT No:21 & 29
ప్రకటన
D21:K.Habeeba Khanam W/o Kammuru Mahaboob Basha, R/at D.No:9/5/639/15/1, J.R.S.Colony, Rayadurgam,
D29:D.Riyaj Ahamed S/o D.Madar Sab, R/at D.No:15/1320/3, Zero Road, Sanjeeva Nagar, Tadipatri.
పై నెంబరు దావాలో ప్రతివాదులయిన మీ హాజరు నిమిత్తం 24-01-2023 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
R.YERRY SWAMY, B.V.RAMANA YADAV
ADVOCATES, ANANTHAPURAMU

In the court of the Prl. Senior Civil Judge,
Ananthapuramu
E.P.No:196/2018 in DRA No:211/2015
Between:
Shriram Raghavendra Chits (P) Ltd. Ananthapuramu. Rep.by its Branch Manger Cum Authorised Person K.Kiran Kumar
...petitioner/D.Hr
And
M.Sudhakar And Others ...Respondants/J.Drs
To
J.Dr2: M.Rama Subbaiah S/o M.Pedda Subbarayudu R/at D.No:6-5-655, Srinagar colony, Ananthapuramu.
J.Dr 2 కి Order 21 Rule-54 C.P.C. Notice
డిక్రీ హోల్డర్‌కు రావాలసిన ఇ.పి మొత్తము వసూలు చేయుటకు గాను ఇ.పి లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసి యున్నారు. సదరు ఇ.పి వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తము 04-01-2023వ తేదికి వాయిదా వేసి యున్నారు. అందులకు మీకు ఆక్షేపణలు ఉన్న యెడల సదరి దినము 10:30 గంటలకు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమునందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
A.SURESH KUMAR
ADVOCATE, ANANTHAPURAMU

విద్యార్థి నాయకులకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శింగనమల కెజిబివి పాఠశాల విద్యార్థుల పక్షాన ప్రశ్నించేందుకు వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులపై అనుచితంగా మాట్లాడిన శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ అధ్యక్షనతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నెల రోజుల్లో 50 మంది విద్యార్థులు విషపు ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారన్నారు. విద్యార్థి నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ఎమ్మెల్యే కించపరుస్తూ మాట్లాడి అవమాన పరచడం సమంజసం కాదన్నారు. చేతనైతే మీ కోపాన్ని మీ నిబద్ధతని పర్యవేక్షణ చేయని అధికారులు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏజెన్సీ నిర్వాహకులు, అక్కడ పని చేస్తున్న సిబ్బందిపై ప్రదర్శించాలన్నారు. నిరంతరం విద్యార్థుల సమస్యలపైన అనునిత్యం పోరాటం చేస్తున్న విద్యార్థి నాయకులపై కాదన్నారు. ఇప్పటికైనా విద్యార్థి నాయకులకు క్షమాపణ చెప్పి కస్తూర్బా పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యనమల నరేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్, సందీప్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్, విఎన్ఐవి రాష్ట్ర అధ్యక్షులు టిపి.రామన్న, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జిట్ట రామ్మోహన్ యాదవ్, ఎస్సీ జన సంఘం అధ్యక్షులు కుళ్లాయప్ప, జనసేన పార్టీ నాయకులు సాకే పవన్, విఎన్ఐవి రాష్ట్ర కార్యదర్శి వినోద్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గడ్డం ముత్యాలప్ప, ఏహెచ్‌పిఎస్ అధ్యక్షులు రాహుల్, ఆర్‌వివి కోఆర్డినేటర్ వెంకటేష్, ఆర్సీసీ అధ్యక్షులు శివానంద, బీసీ సంక్షేమ సంఘం హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు చక్రధర యదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివాదం తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

'పివికెకె'లో ఇంటర్ కళాశాలల క్రీడాపోటీలు

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కేవశనాయుడు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేటలోని పివికెకె ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే ఇంటర్ జూనియర్ కళాశాలల స్పోర్టెక్-2కె 22-23 పేరిట క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్, ఆన్‌సెట్ సిఇఒ జి.కేశవనాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శ్రీ బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ కిషోర్ పల్లె మాట్లాడుతూ.. కళాశాలలో విద్యతో పాటు క్రీడలు కూడా అంతర్భాగమని, అందుకు అంతర్జాతీయ స్థాయిలో కళాశాలల క్రీడాప్రాంగణాలు అభివృద్ధి పరిచామన్నారు. కళాశాల విద్యార్థులు జెఎన్‌టియు యూనివర్సిటీ బృందాలలో ప్రాతినిథ్యం వహించడం గర్వకారణమన్నారు. ప్రతి సంవత్సరం క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నూతనంగా హ్యాండ్ బాల్ కోర్ట్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. దీనిని కేశవ నాయుడు చేతుల మీదుగా ప్రారంభించామని చెప్పారు. కేశవ నాయుడు మాట్లాడుతూ..పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో ఇంత ఘనంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్రీడలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసానికి ఎంతగానో తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించి విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పల్లె సింధూర, ప్రత్యేకాధికారి ప్రొ.శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ కేరళ డీజీపీ శంకర్‌రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.బండి రమేష్‌బాబు, బాలాజీ ఎంబిఎ, ఎంసిఎ కళాశాలల ప్రిన్సిపల్స్ డా.సుబ్బారావు, డా.మన్మదేశ్వర‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒటిపిఆర్‌ఐలో కన్వీనర్ కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురము జేఎన్టీయూ అనుబంధ ఒటిపిఆర్ఐ కళాశాలలో కన్వనర్ కోటాలో మిగిలిపోయిన సీట్లకు జనవరి 3వ తేదీ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు కళాశాల డైరెక్టర్ ఆచార్య బి.దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒటిపిఆర్ఐ కళాశాలలో ఎంఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, ఎంఎస్సీ ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ నందు కన్వనర్ కోటాలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి చెప్పారు. ఈ కోర్సులకు ఎపి పిజిసెట్-2022లో అర్హత సాధించి సంబంధిత డిగ్రీ నందు ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. అర్హత కలిగి ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సరిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను కూడా తీసుకుని ప్రాసెసింగ్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జనవరి 3వ తేది ఉదయం 10 గంటలకు జేఎన్టీయూ అడ్మిషన్ ఆఫీసులో సంప్రదించాలన్నారు. కన్వీనర్ కోటా ద్వారా ఇంతవరకు అడ్మిషన్ తీసుకోని విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ సీటు పొందిన విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులు కాదని తెలిపారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జెఎన్‌టియుఎ.ఎసి.ఇన్ వెబ్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

టోర్నమెంట్ నిర్వాహకులకు సహకారం

ప్రజాశక్తి-తాడిపత్రి

ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడిపత్రి ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు నిర్వహిస్తున్న క్రీడా టోర్నమెంటుకు టిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి సహకారం అందించారు. గురువారం టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించారు. స్థానిక కడప రోడ్డులో ఉన్న చర్చి స్కూల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌కు విచ్చేసిన ఆయన నియోజకవర్గంలోని 800 మంది విద్యార్థులకు బోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు పుట్లూరు భాస్కర్‌రెడ్డి, దూదేకుల కుళ్లాయప్ప, నూర్‌మహమ్మద్, సాంబశివారెడ్డి, రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

నెల్లూరు జిల్లా కందుకూరులో బుధవారం జరిగిన బహిరంగ సభలో 8 మంది మృతికి కారణమైన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, సభ నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాయదుర్గంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఉనికి కోసం చంద్రబాబు ఇరుకైన రోడ్డుపై బహిరంగ సభ నిర్వహిస్తూ, డ్రోన్ కెమెరాతో కవరేజీ చేయిస్తూ, అక్కడ జరిగిన తొక్కిసలాటలో కాలువలో పడి ఎనిమిది మంది మృతికి కారణమయ్యారన్నారు. గతంలోనూ చంద్రబాబు గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రచారం కోసం 30 మందిని బలి తీసుకున్నారన్నారు. బషీర్‌బాగ్ ఘటనలో రైతులు, అంగన్వాడీ కార్యకర్తలపై అమానుష చర్యల వల్ల చంద్రబాబు కారణంగా పలువురు అమాయకులు చనిపోయారన్నారు. చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసం ఇంకా ఎంత మందిని బలి తీసుకుంటారని ప్రశ్నించారు. చంద్రబాబు సభలో 8 మంది అమాయకులు మరణిస్తే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కనీసం ప్రెస్ మీట్ పెట్టి క్షమాపణలు చెప్పడం గాని, సంతాపాన్ని గాని వ్యక్తం చేయలేదన్నారు. భవిష్యత్తులో చంద్రబాబు సభలకు అనుమతి కోరితే విషాద ఘటనలు జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల స్థానిక పోలీసులు అంతర్రాష్ట్ర నేరస్తుల ముఠాను పట్టుకుంటే ఈ ఘటనతో తన అనుచరులకు ప్రమేయం ఉందని ఎల్లో మీడియాలో ప్రసారం కావడం విచారకరం అన్నారు. తనపై బురద చల్లడం వల్ల తాను ఆ మీడియాపై విరుచుకుపడతాననే ఉద్దేశంతో కాలువ శ్రీనివాసులు స్వయంగా తన అనుచరులతో ఎబిఎన్, ఆంధ్రజ్యోతి విలేకరులను కొట్టించి ఆ అనిందను తనపై నెట్టే ప్రమాదం ఉందన్నారు. ఎబిఎన్, ఆంధ్రజ్యోతి విలేకరులపై దాడులు జరగకుండా పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో వైసిపి నియోజకవర్గం పరిశీలకులు కుమార్‌రాజా, వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, గుమ్మగట్ట జడ్పిటిసి సభ్యులు మహేష్, మండల కన్వీనర్ మంజునాథ, పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలీబాషా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న విప్ కాపు

గుత్తిలో ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 147 మంది విద్యార్థినులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ బి.రవి నాయక్ అధ్యక్షతన ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు-నేడు పథకం కింద నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చేసిందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి పాటుపడుతున్నారని చెప్పారు. పేద విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్యార్థినులు సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూరుబి, వైస్ చైర్‌పర్సన్ లు పద్మలత, వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి, ఎంపీడీవో అమృతరాజ్, ప్రిన్సిపల్ ఉషారాణి, వైసిపి సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, పట్టణ మండల కన్వీనర్లు హుస్సేన్ పీరా, గోవర్ధన్ రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రిన్సిపల్ ప్రభాకర్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సూరి, వైసిపి నాయకుడు సురేష్ చేతుల మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎపి మోడల్స్ స్కూల్ విద్యార్థులకు కూడా ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ ఉష తెలిపారు.

ఉరవకొండ : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్య ద్వారా ఉజ్వల భవిత చేకూరుతుందని సర్పంచి ఎం.సిద్ధార్థ అన్నారు. గురువారం ఉరవకొండ మండలం మోపిడి గ్రామం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సర్పంచి సిద్ధారెడ్డి, ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేషగిరి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బోయ సతీష్, వైసిపి నాయకులు సుధాకర్, ప్రసాద్, రామకృష్ణ, లాలెప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ రామేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నార్పల : బి.పప్పూరు గురుకుల పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జెడ్పీ ఛైర్మన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు చేతుల మీదుగా గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్ధిరాచర్ల సర్పంచి రామాంజనేయులు, ఎంపిటిసి పద్మాకర్‌రెడ్డి, సర్పంచి పెద్దన్న, స్కూల్ కమిటీ ఛైర్మన్ సంజమ్మ, సలహా కమిటీ ఛైర్మన్ పెద్దిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : శ్రీరంగపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వతరగతి చదివే విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతిరెడ్డి, వైసీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, పాండు, చిత్తప్ప, శేఖర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మన మంచిని ప్రతి ఒక్కరికీ చెబుదాం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ

అనంతపురం : వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న పరిపాలన చరిత్రలో సరికొత్త అధ్యాయమని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మనం చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ చెబుదామని.. ఇందులో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వాలంటీర్లు వివరిస్తే.. వైసీపీ అధికారంలో ఉండబట్టే సంక్షేమ పాలన కొనసాగుతోందన్న విషయాన్ని కన్వీనర్లు వివరించాలని స్పష్టం చేశారు. గురువారం ఉదయం రాంనగర్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో, మధ్యాహ్నం గుత్తి రోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనంతపురం నియోజకవర్గ పరిశీలకులు వెంకట్‌రెడ్డి యాదవ్ హాజరయ్యారు.

పెద్దపప్పూరు : సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల ఆత్మీయ సమ్మేళనాన్ని చిన్నపప్పూరు గ్రామ సమీపంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అంశాలను కన్వీనర్లు, వాలంటీర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్ సివి.రామన్ విద్యా సంస్థల అధినేత భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గొందలదిన్నె రామయ్య పాల్గొన్నారు.

పెన్షనర్లకు బయోమెట్రిక్ సదుపాయం

రాయదుర్గం : పెన్షనర్ల సౌకర్యార్థం రాయదుర్గం పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో జనవరి 1వ తేదీ నుండి బయోమెట్రిక్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక పరిశీలనలో భాగంగా ప్రతీ పెన్షనర్ బయోమెట్రిక్ విధానం ద్వారా సబ్ ట్రెజరీలో లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం బయోమెట్రిక్ విధానం అవసరం కాగా అసౌకర్యాన్ని పెన్షనర్ల సహాయార్థం తమ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పెన్షనర్లు బయోమెట్రిక్ పరిశీలన నిమిత్తం తమ వెంట ఆధార్ కార్డు, పాన్ కార్డు, కలర్ ఫొటో, ఐడి నెంబర్, ఫోన్ నెంబర్, బ్యాంకు పాస్ పుస్తకం తీసుకురావాలని కోరారు. పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులుగా హెచ్‌ఎండి ఆసిఫ్

యాడికి : యాడికి మండల కేంద్రానికి చెందిన హెచ్.మొహమ్మద్ ఆసిఫ్ అనంతపురం జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులుగా ఎంపికైనట్లు అనంతపురం జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ కెఎస్.రిజ్వాన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ తనను ఎంపిక చేసిన సిఎం జగన్మోహన్‌రెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసిపి మండల సీనియర్ నాయకులు బాల రమేష్‌బాబు, వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ రిజ్వాన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం, జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఆత్మకూరులో పరిటాల సునీత పాదయాత్ర

ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలోని సింగంపల్లి, సింగంపల్లి తండా, వై.కొత్తపల్లి, పి.యాలేరు, ఆత్మకూరు గ్రామాల్లో మాజీ మంత్రి పరిటాల సునీత గురువారం రైతుల కోసం పాదయాత్ర నిర్వహించారు. వై.కొత్తపల్లి గ్రామంలో టమోటా, అరటి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు తమ పంటలను పూర్తిగా నష్టపోయారన్నారు. రైతులను ఆదుకోవడంతో ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నష్టం వాటిల్లిన పంటలను కూడా పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, సబ్సిడీ పరికరాలు ఇవ్వలేదన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి బాలాజీ నారాయణస్వామి, కన్వీనర్ శ్రీనివాసులు, బోధపాటి హరి, ఓబుళపతి, గులికొండ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పురుషోత్తమ మురళీకృష్ణ, నిర్మలమురళి పెళ్లిరోజును పురస్కరించుకుని పేద ప్రజలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. సోమలదొడ్డి పరిధిలో ఉన్న పలు కాలనీల్లోని పేద కుటుంబాలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. చలికాలంలో పేదల ఇబ్బందులను గమనించి వాటర్ బాటిళ్లు, దుప్పట్లను అందించామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నాగరాజు, మహిళలు, వృద్ధులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అవ్వాతాతలపై జగనన్న ప్రతాపం

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

అనంతపురం : తాను అధికారంలోకి వస్తే సామాజిక పింఛన్ రూ.3000 ఇస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకేసారి ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతానని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు పింఛన్ల రీ సర్వే పేరిట అవ్వాతాతలపై ప్రతాపం చూపుతున్నారని జనసేన జిల్లా అధ్యక్షులు, అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టిసి.వరుణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి వికలాంగులు, వితంతువులకు కూడా నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకు 50 వేల మందిని అనర్హులను వస్తున్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి అనుచిత నిర్ణయాలతో రాష్ట్రంలో సామాజిక భద్రత కరువైందని వరుణ్ మండిపడ్డారు. కరువు జిల్లా అనంతలో సామాజిక పింఛన్లపై ఆధారపడి వేలాది మంది అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు జీవిస్తున్నారన్నారు. 15 ఏళ్లుగా పింఛన్లు అందుకుంటున్న వారు ఇప్పుడు ఏవిధంగా అనర్హులు అవుతారో సమాధానం చెప్పాలన్నారు. అలాంటి వారిని తిరిగి ఇబ్బందులు పాలు చేసే విధంగా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం ఆక్షేపనీయమన్నారు. అనంత జిల్లాలో ఏ ఒక్క పింఛన్ తొలగించినా సహించేది లేదని.. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సారధ్యంలో మరో ప్రజా పోరాటానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

బెస్తలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ఉరవకొండ : అత్యధిక శాతం జనాభా కలిగిన బెస్త కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలూ రాజకీయ ప్రాధాన్యతను కల్పించాలని బెస్త సంఘం జిల్లా అధ్యక్షులు కెవి.రమణ డిమాండ్ చేశారు. గురువారం ఉరవకొండ నియోజకవర్గం బెస్త సేవా సంఘం సర్వసభ్య సమావేశం బెస్త తిప్పయ్య అధ్యక్షతన వాల్మీకి కళ్యాణ మండపం నందు గురువారం జరిగింది. అంతకుముందు బెస్తల ఐక్యత వర్ధిల్లాలని, బెస్తలకు రాజ్యాధికారంలో వాటా కల్పించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా బెస్త సేవా సంఘం అధ్యక్షులు కెవి.రామణ, గౌరవాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, చంద్రబాబు, నాగేంద్ర, గంగప్ప, నాగరాజు ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ అనాదిగా బెస్తలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారన్నారు. భవిష్యత్తులో అన్ని పార్టీలు బెస్తలకు రాజకీయాలలో సముచిత స్థానాన్ని కల్పించకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెస్త సంఘం నాయకులు వెంకటేశులు, హెల్త్ రమణ, రామన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నియోజకవర్గం అధ్యక్షులుగా బెస్త తిప్పయ్య, కార్యదర్శులుగా ఎం.ఎర్రిస్వామి (మరుట్ల), వన్నూరుస్వామి (విడపనకల్లు) కోశాధికారిగా బెస్త సర్వేష్ (ఉరవకొండ), గౌరవాధ్యక్షులుగా రామాంజనేయులు (ఉరవకొండ), రామన్న (ఉరవకొండ), నాగన్న (ప్యాపిలి), ఎర్రిస్వామి (విడపనకలు), ప్రతి మండలం నుంచి ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, మొత్తం 56 మందితో నియోజకవర్గ కమిటీ ఏర్పాటు చేశారు.

డబుల్ సెంచరీ సాధించిన తాడిపత్రి క్రీడాకారుడు

తాడిపత్రి : తాడిపత్రి ఆర్డీటీ క్యాంపునకు చెందిన క్రీడాకారుడు అతికారి జయంత్‌కృష్ణ బెంగళూరులో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో హట్ అవాక్స్ న్యాజిలాండ్ టీం పైన డబుల్ సెంచరీ నమోదు చేశాడు. 72 బాల్స్‌కి 100 పరుగులు సాధించిన జయంత్‌కృష్ణ అనంతరం 30 బంతుల్లోనే 100 పరుగులు చేసి అసాధారణ ప్రతిభ కనబరిచి 200 పరుగులు సాధించాడు. 21 ఫోర్లు 11 సిక్సర్లతో పరుగుల వర్షం కురిపించాడు. ఇతను భవిష్యత్తులో అండర్ 19 ఇండియా జట్టుకు స్థానం సాధించాలనే ఆశయానికి అనుగుణంగా ఆటతీరు ప్రదర్శించాడు. డబల్ సెంచరీ సాధించినందుకు జయంతికృష్ణను సీనియర్ కోచ్ సాదిక్‌వలి, ఆర్‌డిటి కోచ్ భార్గవ్ హర్షం వ్యక్తం చేశారు.

కందుకూరు ఘటన బాధాకరం

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడు

గుంతకల్లు : నెల్లూరు జిల్లా కందుకూరు ఘటనలో 8 మంది టిడిపి కార్యకర్తలు మృతి చెందడం అత్యంత బాధాకరమని గుంతకల్లు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడు అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆయనతో పాటు టిడిపి నాయకులు మృతి చెందిన కార్యకర్తలకు సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. పార్టీ కోసం కార్యకర్తలు చేసిన ప్రాణ త్యాగాలు మరువలేనివన్నారు. పార్టీ చరిత్రలో వారి ప్రాణత్యాగాలు నిలిచి పోతాయన్నారు. గుంతకల్లు మండలంలోని వైటి.చెరువు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలు గుత్తి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మరణించడం బాధాకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపిపి రాయల్ రామయ్య, టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బిఎస్.కృష్ణారెడ్డి, ఎస్సీసెల్ నియోజకవర్గ కన్వీనర్ చికెన్ జగన్, బిసిసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.కేశప్ప, సీనియర్ నాయకులు శివన్న, జగన్నాథ్, మధు, హనుమంతు, రామాంజనేయులు, ఫజులు, మస్తాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : చంద్రబాబు నాయుడు కందుకూరు పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు నార్పల టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, మండల సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసిలు, సర్పంచులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : నెల్లూరు జిల్లా కందుకూరు ఘటనలో మృతిచెందిన వారికి టిడిపి నాయకులు నివాళి అర్పించారు. గురువారం రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో టిడిపి అమరుల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళిఅర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మండల కన్వీనర్ హనుమంతు, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, గుమ్మఘట్ట క్లస్టర్ ఇన్‌ఛార్జి సన్నన్న, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు మల్లి, తిప్పేస్వామి. వెంకటేశులు, శీనా, సిద్దన్న, బిసిసెల్ ధనార్జన తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

బుక్కరాయసముద్రం : కొర్రపాడు పిహెచ్‌సిలో ఎంపీపీ దాసరి సునీత ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి పిహెచ్‌సిలో వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులు, పరికరాలను కొనుగోలు చేయుటకు తీర్మానించారు. కొర్రపాడు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి గర్భిణులకు ఐరన్ మాత్రలు, 500 నార్మల్ సెలైన్ బాటిళ్లు విరాళంగా అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, మెడికల్ ఆఫీసర్ శ్రీహర్ష, వినోద్, అగ్రహారం సర్పంచి భాగ్యమ్మ, రోటరీపురం నాగభూషణం పాల్గొన్నారు.